అనుక్షణం పుట్టెడు కష్టాన్ని భరిస్తూ భూగోళమంత
అప్పుల భారం మోస్తూ, కన్నీటి సముద్రాన్ని ధైర్యంగా దాటగల రైతుకు
రేపటి మీద గుప్పెడంత ఆశను ఎవరు కల్పిస్తారు?
జీవించడం కన్నా విలువైనది లేదని... జీవించడమే అసలైన గెలుపు
అని అన్నదాతకు ఎవరు చెప్తారు?... అన్న ఆలోచనల
అంతర్మథనమే ఈ కథ.

చందు తులసి

10

# ఊరవతల ఊడలమర్రి





“మనిషై పుట్టిన తర్వాత కొంచెమన్నా సిగ్గూ రోషం ఉండాల. చెప్పిన మాట మీద నిలబడాల. అప్పు తీసుకున్నపుడు ఎన్ని ముచ్చట్లు చెప్పినవ్...? తీరా అప్పు కట్టమంటే మాత్రం పిట్టకథలు చెప్తున్నవ్. అంత చేతకానోడివి అప్పెందుకు తీసుకున్నవ్? నేనేం నీ ఇంటి కొచ్చానా...? నువ్వేకదా పదిసార్లు పొద్దూ, మాపూ ఇంటి చుట్టూ తిరిగినవ్. పోయినేడాది ఏం చెప్పినవ్...? వచ్చే సమత్సరం కడతా సేటూ అన్నవ్. మరి కట్టినవా...? పైగా ఏ సంగతీ చెప్పకుండా దొంగోని మాదిరి తప్పించుకొని తిరుగుతున్నావు. నీ కోసం తిరిగీ తిరిగీ పాణం యాష్టకొచ్చింది. ఇంకా నీ ఇంటి చుట్టూ తిరిగే ఓపికా లేదు, అంత గాచారామూ నాకు పట్టలేదు. ఇయ్యాల ఎట్టాగైనా నా అప్పు కట్టి తీరాల్సిందే.”

“నిజమే సేటుగారూ... కానీ ఇప్పటికిప్పుడు తీర్చమంటే ఎట్లా తెచ్చేది..?” మెల్లగా నసిగాడు నారాయణ.

“ఎట్టా తీరుస్తానని తీసుకున్నావు అప్పు? ఎట్టా తీర్చేది కూడా నేనే సెప్పాల్నా... నీ పెండ్లాన్ని పంపు సెపుతా...”

పొద్దున బాకీ వసూలుకోసం వచ్చిన సేటు.. అన్న మాటలే మళ్లీమళ్లీ వినిపిస్తున్నాయి నారాయణకు. గబగబా నడుస్తున్నాడు నారాయణ.

‘దొంగ నా కొడుకు... ఎన్ని మాటలన్నాడు. వాడేం ఉత్త పుణ్యానికిచ్చాడా...? నూటికి ఐదు రూపాయలు వడ్డీ తీసుకుంటున్నాడు కదా. నేనేం అప్పు ఇయ్యనన్నానా..?’ ఆలోచిస్తూనే ఊరవతల ఊడలమర్రి కాడికి చేరుకున్నాడు నారాయణ.

ఆవేశంలో ఉరి పెట్టుకుందామని వచ్చాడు కానీ తాడు తెచ్చుకోవడం మర్చిపోయాడు.

ఇప్పుడెట్టా...? చెట్టువైపు చూశాడు. జడలు విరబోసుకున్న బ్రహ్మరాక్షసి మాదిరిగా ఉంది ఆ మర్రిచెట్టు.

పరిశీలనగా చెట్టు వైపు చూసి ఉలిక్కిపడ్డాడు.

ఒక్కటి కాదు. రెండు కాదు. కొమ్మ కొమ్మకో ఉరితాడు. మొక్కులు తీర్చమని దేవుడి గుల్లో కట్టినట్లు.

తాళ్లు... ఉరితాళ్లు...

ఇంకా పైకి చూశాడు.

గబ్బిలాలు తలకిందులుగా వేలాడుతున్నాయి. అవి గబ్బిలాల్లా లేవు. ఆ చెట్టుకు ఉరిపెట్టుకుని చచ్చిన వారి ఆత్మల్లా ఉన్నాయి.

గబగబా చెట్టు మీద ఉన్న ఓ తాడు అందుకోబోయాడు.

అంతే. యాన్నుంచి వచ్చాడో హఠాత్తుగా ఊడిపడ్డాడు సేటు. వస్తూనే... "దొంగ నా కొడుకా... సచ్చిపోతే అప్పు తీర్చే పనిలేదని సంబరపడుతున్నావా? నువ్వు హాయిగా సచ్చిపోతే నా అప్పెవడు తీరుస్తాడు. నా అప్పు తీరిస్తే కానీ నిన్ను సావనివ్వను... హహహ్హాహ్హా," అంటూ వికటాట్టహాసం చేశాడు.

ఆ శబ్దానికి... తపోభంగమైన మునుల్లాగా ఉలిక్కిపడ్డాయి గబ్బిలాలు.

కీచ్ కీచ్... కీచ్... కీచ్... అంటూ వందలాది గబ్బిలాలు భోరున విలపిస్తూ చెట్టు చుట్టూ తిరుగుతున్నాయి.

వాటిని జాగ్రత్తగా చూశాడు నారాయణ. నిజమే. అవి గబ్బిలాలు కాదు. ఆత్మలే. వాటిలో తమ తాత ఉన్నాడు. అప్పు తీర్చలేక సచ్చిపోయిన నాయన ఉన్నాడు. గొడ్రాలని నింద తట్టుకోలేక ఉరి పోసుకుని సచ్చిపోయిన ఊర్మిళక్క ఉంది. వొకరిద్దరు కాదు. అప్పు కట్టలేక సచ్చిపోయిన ప్రతి రైతూ ఉన్నాడు.

వాళ్లే... వాళ్లే... చెట్టు చుట్టూ భోరున విలపిస్తూ గబ్బిలాల్లా తిరుగుతున్నారు.

"తాతా... నాయనా... అక్కా..." గట్టిగా కేకలు పెట్టుకుంటూ గబ్బిలాలని పట్టుకోపోయాడు నారాయణ.

"ఏమైందయ్యా... ఏందా కలవరపాటు..." భార్య పూలమ్మ కేకలతో కళ్లు తెరిచి చూశాడు నారాయణ.

కల... అంతా కల.

"ఏందయ్యా పొద్దున్న సేటు గొడవ చేసిన కాన్నుంచి అదోలా ఉన్నావు. పిచ్చి పిచ్చిగా మాట్లాడతన్నావు. నాకేందో భయంగా ఉంది," భోరున ఏడుస్తూ అంది పూలమ్మ.

రెండేళ్ల నుంచి అప్పు తీర్చనందుకు పొద్దున్న సేటు ఇంటి ముందు పెద్ద పంచాయతీ పెట్టాడు.

"మూడు రోజుల్లో అప్పు తీరిస్తే సరే. లేదంటే ఇల్లు వేలం వేసి అయినా నా అప్పు వసూలు చేసుకుంటా,"నని చెప్పి ఫర్మానా జారీచేసి పోయాడు.

చెప్పటానికి నారాయణ కథ కొత్త కథ కాదు. అందరికీ తెలిసిన కథే. దేశంలోని అందరి రైతుల్లాంటిదే. నారాయణ కానీ ఉన్నపళంగా ఆత్మహత్య చేసుకుంటే... జిల్లా పేజీలో వార్తకో, ప్రతిపక్షం వాళ్లకు ఆందోళనకో తప్ప దేనికీ కొరగాని కథ.

ఐదు వేళ్లతో తినే అన్నంముద్ద సాక్షిగా ఈ దేశంలో ఏ ఒక్కరికీ పట్టని మామూలు రైతు కథ.

✤

నారాయణ సొంతంగా ఒకే ఒక్క ఎకరం భూమి ఉన్న రైతు. ఒక్క ఎకరం సేద్యంతో మొగడు సచ్చిన తల్లినీ... మొగడు ఇంకా సావని పెళ్లాన్ని, పిల్లలని సాకేదెట్టా...? అందుకే ఇంకో ఐదెకరాలు కౌలుకు తీసుకున్నాడు. మిగతా రైతుల్లాగే నారాయణ కూడా బీటీ పత్తి తప్ప ఇంకో పంట కన్నెత్తి కూడా చూడలేదు. అసలు పత్తి తప్ప ఇంకో పంట కూడా ఉందన్న సంగతి ఎప్పుడో మరిచిపోయాడు. ఒక ఏడు పంట పండితే... ధర కలిసిరాదు. ధర కలిసొస్తే... పత్తి వ్యాపారి పంట కొనడు.

సరిగ్గా అలాగే ఈ ఏడాది గింజలు భూమిలో ఏ క్షణాన ఏశాడో కానీ ఏసిన గింజలు ఏసినట్లు కాకులు, పిట్టలు ఏరుకొని తిన్నై కానీ... ఒక్క గింజా మొలవలేదు. 'ఆకాశంలో అప్పుడప్పుడు వాన కురుస్తుంది,' అని చెప్పుకోవడానికైనా మచ్చుకు ఒక్క చుక్క పడలేదు. ఏం చేయాలి.? చేయటానికి పనిలేదు. తెలిసింది ఒక్క సేద్యమే. ఏస్తే గీస్తే మళ్లీ పత్తే వెయ్యాలి. పంట పండదన్న సంగతి సేటుకు ఎలా తెలిసిందో కానీ ఇంటి ముందు డేగలా వచ్చి వాలాడు. నారాయణ ఒకటి రెండుసార్లు ఇంట్లో ఉండి కూడా లేడని భార్య పూలమ్మతో అబద్ధం చెప్పించాడు. అలా ఒకటి రెండు సార్లు తప్పించుకున్నాడు కానీ సేటు ఇవాళ ఇంకా ఎవరూ నిద్ర లేవకముందే వచ్చాడు. వస్తూనే ఇంట్లో సామానంతా బయటకు విసిరేశాడు. ఆ గొడవకు చుట్టు పక్కల వాళ్లు వచ్చారు. అందరి ముందే నానా బూతులు తిట్టి పరువు తీశాడు సేటు.

నారాయణకు చానా బాగా గుర్తు. ఆ సేటు అసలు ఈ ఊరివాడు కాదు. ఎక్కన్నుంచో ఒక తరాజు... చెక్కపీట చేతిలో పట్టుకుని వచ్చాడు. సారాయి, కల్తీ ఎరువులు ఇలా రకరకాల యాపారాలు చేసి బాగా సంపాదించాడు. ఆ సంపాదించిన డబ్బు రైతులకే అప్పులకు ఇచ్చి... దొంగ వడ్డీలు రాసి మరింత పెంచాడు. ఒకప్పుడు రైతుల దగ్గర వంగి వంగి దండాలు పెట్టినవాడు ఇవాళ అదే రైతులను, 'దొంగ నా కొడకా...' అని కూడా అనగలుగుతున్నాడు.

నారాయణకు పొద్దట్నుంచి ఒకటే ఆలోచన... 'సేటు అప్పు తీర్చేదెట్టా...?'

ఉన్న భూమంతా అమ్మినా కూడా లక్ష రూపాయలు రావు. సేటు దగ్గర అప్పు మూడు లక్షలు.

నారాయణకు తన దోస్తు జగ్గడు గుర్తొచ్చాడు. జగ్గడిదీ నారాయణదీ ఒకటే ఈడు. కలిసే చదువుకున్నారు. వానాకాలం చదువులు. రెండ్రోజులు బడికి. మూడు రోజులు సేద్యానికి. చదువు మధ్యలోనే మానేసి బర్లని మేపేవారు. ఓసారి జగ్గడు ఇంట్లోంచి వాళ్ల నాయిన తాగే సారాసీసా తెచ్చాడు. కందిచేల మధ్యన దాచుకుని మొదటిసారిగా నారాయణ సారా తాగాడు. అప్పటినుంచి జగ్గడు, నారాయణ పండుగలకు పెళ్లిళ్లకు తప్పకుండా సారాయి తాగేవాళ్లు.

ఓరోజు జగ్గడి నాయన అప్పులు తీర్చలేక మర్రిచెట్టు కింద ఉరి పెట్టుకుని చచ్చిపోయిండు. తండ్రి పోయిండు కానీ సేద్యం పోలేదు కదా...! అది జగ్గడి మెడకు చుట్టుకుంది. జగ్గడు వ్యవసాయం మొదలుపెట్టాడు. పెళ్లి చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు. ఒకటీ రెండేళ్లు బానే జరిగినా... పోయిన ఏడాది కాలం కలిసిరాలేదు. ఆ బాధతో సారాయికి బానిసగా మారాడు. తాగి తాగి పిచ్చోనిలా మారిపోయాడు. ఓరోజు తండ్రి చనిపోయిన మర్రిచెట్టుకే అదే కొమ్మకు ఉరి వేసుకున్నాడు. జగ్గడు ఉరి పెట్టుకునే సమయంలోనే నారాయణ కొంచెం దూరంలో ఎద్దులు మేపుతూ ఉన్నాడు. జగ్గడు చేసే ఘోరం చూసి... నెత్తి నోరు బాదుకుంటూ గబగబా కిందామీదా పడుతూ ఉరికొచ్చిండు. కానీ ఈ లోపలే జగ్గడు కాళ్లు గిలగిలా కొట్టుకుని పాణం తీసుకున్నడు.

అప్పట్నుంచీ నారాయణకు కళ్లు తెరిసినా మూసినా ఆ మర్రిచెట్టే కనిపిస్తోంది. ఆ చెట్టుకు ఉరిపోసుకుని చనిపోయింది ఒకరో ఇద్దరో కాదు. చానామంది ఉసురు తీసుకున్నారు. నారాయణ ఇంట్లోనే ముగ్గురు. వాళ్ల తాత, నాయన, పెద్దక్క ఆడనే ఊపిరి వదిలారు.

✤

"ఇంకా పడుకోలేదా...?" ఆకాశంవైపు ఎగాదిగా చూస్తూ ఉన్న భర్తను అడిగింది పూలమ్మ.

"అప్పు ఎట్ల తీర్చాలె అనే కదా నీ దిగులు... నువ్వేం గుబులు చెడకు. నా మాట ఇను. పట్నంల ఉన్న పెద్దవ్యాపారి సత్తినారి సేటుకాడ అప్పు అడిగి చూడయ్యా. ఆయన అయితే వడ్డీ ఎక్కువ తీసుకున్నా... రెండు మూడేళ్లదాకా ఆగుతడు కదా," అని సలహా ఇచ్చింది.

"మరి పంట రాకుంటే ఎట్లా తీరుద్దాం...?" అనుమానించాడు నారాయణ.

"కాలం ఎప్పుడూ ఒకే తీర్గ ఉండదు కదయ్యా. ఏమో...? వచ్చే ఏడాది కాలం అయ్యి వానలు పడకపోతయా...? పంటలు పండకపోతయా... మన అప్పులు తీరకపోతయా...? అడవిలో మోదుగులు బతుకుతున్నయి... మనం బతకలేమా..?" భరోసా ఇచ్చింది భర్తకు.

✤

పొద్దున్నే లేచి టవునుకు వెళ్లాడు నారాయణ.

సత్తినారి సేటు అప్పుల వసూళ్ల కోసం వేరే ఊరు పోయిండట. పన్నెండింటికి వస్తడు అన్నది సేటు భార్య. ఇంటి ముందలనే కూలబడ్డడు నారాయణ. అటు పోయి-ఇటు పోయి టైం ఒంటిగంట దాటింది. అయినా సత్తినారి సేటు రాలే. పొద్దున బస్సు అందుకోవాలన్న ఆరాటంలో... రాత్రి మిగిలిన బువ్వ కొద్దిగంత తిని వచ్చిండు నారాయణ. అందుకనే కడుపుల ఆకలి పుట్టింది. లేచి ఏమన్నా తిందామని హోటల్ దిక్కు పోయిండు.

"నారాయణన్న బాగున్నవానే." ఎవరో పలుకరించేసరికి అటువైపు చూసిండు.

"నేనే అన్నా... వెంకటమ్మను. మాలపల్లె."

"ఆ ఆ... పెద్ద రాములు బిడ్డవు కదా. మొగడు వదిలిపోయే. అమ్మ నాయిన జరిగిపోయినంక మల్ల కానరావైవితవి. ఎట్లున్నవురా చెల్లె."

"నేను గట్లనే ఉన్న అన్న. ఇదే నా బండి. అన్నం తింటవానే..."

ఒక మురికి కాలువ పక్కన తోపుడు బండి మీద ఓ పెద్ద గిన్నెలో అన్నం... మిగిలిన గిన్నెల్లో కూర, చారు ఉన్నాయి.

లోపల ఆకలి వున్నా మొహమాటానికి వద్దన్నడు.

"ఏం ఫర్లేదన్నా. పైసలియ్యకుంటేమాయే. నీలాంటి కష్టజీవికి పెడితే పుణ్య మొస్తది. బుక్కెడంత తిను అన్నా," అంటూ ఓ ప్లేటులో అన్నం, రెండు చికెన్ ముక్కలు, చారు పోసి ఇచ్చింది.

బాగా ఆకలితో ఉన్నాడేమో నారాయణ. రెండు ముద్దలకే మొత్తం తినేసిండు. ఇంకొంచెం పెట్టమని అని అడిగిండు.

"అవు చెల్లె. నీ మగడు జానయ్య నిన్ను మోసం చేసి పోయిండు కదా... ఎటు పోయినవో, ఏమైపోయినవో అనుకున్నం."

"ఏ ఏట్లోనో దూకుదామనే అనుకున్న. కానీ అప్పటికే నా కడుపుల ఓ నలుసు పడింది. వాన్ని బతికించుకునేటందుకు నిలబడ్డ. మొదట ఈడ హోటల్ల క్లీనింగ్ పనికి

చేరి మెల్లగ వంట చేయడం నేర్చుకున్న. ఇప్పుడు సొంతంగ నేనే ఈ బండి పెట్టిన. రోజు ఓ ఐదారొందలు దాకా వస్తయి. నాకు, నా కొడుక్కు సరిపోతయి. నాకు చేతి కింద ఇంకో ఇద్దరు మనుషులు కూడా ఉన్నరు. నా కొడుకు ఇంజనీరింగ్ సదువు తుండన్నా... ఆని మీద ఆశతోనే బతుకుతున్న.''

అన్నం తిని జేబుల చేయి పెట్టిండు నారాయణ. యాభై రూపాయలు ఇచ్చిండు.

''మీ చేతి కింద బతికినోళ్లం. నీకు బువ్వ పెట్టి పైసలు తీసుకుంటనా అన్నా. పైసలొద్దు ఏమొద్దు,'' అన్నది వెంకటమ్మ.

అయినా బలవంతంగా చేతిల పెట్టి, ''ఎప్పుడన్నా కుదిరితే ఊరికి రా చెల్లె,'' అని చెప్పి గబగబ సత్తినారి సేటు ఆఫీసుకాడికి బాట పట్టిండు.

వెంకటమ్మ చెప్పింది విన్న తర్వాత నారాయణకు తన బతుకుమీద తనకే అసహ్యం పుట్టింది. 'రోడ్ల మీద తోపుడు బండ్లు పెట్టుకున్నవాళ్లు కూడా ఆరామ్‌గా బతుకుతున్నరు. అసలు దేశంల అందరూ సుఖంగానే బతుకుతున్నరు ఒక్క వ్యవసాయం చేసేటోడు తప్ప. పంటలు కొన్న వ్యాపారులు ఇంటి మీద ఏడాదికో అంతస్తు లేపుతున్నరు. పండించిన రైతు మాత్రం బొందల దిగబడుతుండు.'

సత్తినారి సేటు ఇంకా రాలేదు. కానీ అక్కడకి చాలామంది రైతులు వచ్చిన్రు. అందరిదీ వొకే కథ. రైతుకు కావాల్సింది ఏముంటుంది.? అప్పే కదా. వానలు ఎప్పుడొస్తయా అని ఎదురు చూసినట్టే... సత్తినారి సేటు ఎప్పుడొస్తడా అని పడిగాపులు కాస్తున్నరు.

నారాయణ రాత్రి అప్పు గురించి ఆలోచిస్తూ సరిగా నిద్రపోలేదు. తోపుడు బండి దగ్గర వెంకటమ్మ కడుపు నిండా పెట్టిందేమో చిన్నగా కునుకు పట్టింది.

ఇట్ల జరంత కన్ను మూతపపడిందే లేదో.

చెట్టు...ఊడల మర్రిచెట్టు...

జట్టు విరబోసుకుని... కొరివి దయ్యంలా...

ఊడలు ఊపుకుంటూ... రా... రా... అని పిలుస్తోంది.

గబ్బిలాలు... కీచ్ కీచ్...

తాళ్లు... ఉరితాళ్లు.

కారు హార్న్ సప్పుడు కావడంతో ఉలిక్కిపడి కళ్లు తెరిచిండు నారాయణ. కారు దిగిండు సత్తినారి సేటు. పోయినేడాది దాకా బైక్ మీద తిరిగేటోడు. కొత్తగా కారు కొన్నడు. కొంచెం బొర్ర కూడా పెరిగింది. రైతులంతా గబగబ దండాలు పెట్టుకుంట పోయినరు. ఒకల తర్వాత ఒకలు... తన వంతు వచ్చినంక పోయి పరిస్థితి

అంత చెప్పిండు నారాయణ.

"ఏం తాకట్టు పెడతావ్...బంగారమేమన్నా ఉన్నదా...?"

"అంటే పంట అమ్మినంక నీకే ఇస్త సేటు..."

"అరే నారాయణ. ఇప్పుడు పంట మీద అప్పు ఇచ్చే రోజులు పోయినయి. రైతులు కూడా తెలివి మీరిన్రు. పోనీ ఓ పని చేయ్... భూమి కాయితాలేమన్నా ఉన్నయా...?"

నారాయణ కౌలు రైతు. ఉన్న ఒక్క ఎకరానికీ పట్టాలేదు.

"బంగారం లేదు. భూమిలేదు. ఉన్నదానికి పట్టాలేదు. ఏం చూసి అప్పియ్య మంటవు నారాయణా...? కనీసం మీరు ఉరి పెట్టుకుని సచ్చినా గవర్మెంటోడు లక్ష రూపాయలిస్తడు. నాకెవడిస్తడు," సేటు కోపంగా లేచిపోయిండు.

నారాయణకు ఒకపక్క కోపం, ఇంకోపక్క దుఃఖం పుట్టింది. ఒకప్పుడు నారాయణ మార్కెట్‌కు పత్తి అమ్మడానికి వచ్చినపుడు ఇదే సత్తినారి సేటు, 'అమ్మా అయ్యా' అని కాళ్లు వేళ్లు పట్టుకునేవాడు. 'నీకు ఎప్పుడు కావాలంటే అప్పుడు, ఎంత అంటే అంత అప్పు ఇస్తానని,' బతిమాలేవాడు. అట్లాంటోడు ఇప్పుడు అప్పు కూడా ఇవ్వనంటున్నాడు. ఇక చేసేదేంలేక కండువా దులుపుకొని ఇంటిదారి పట్టిండు నారాయణ.

'అయిపోయింది. అంతా అయిపోయింది. ఉన్న ఒక్క ఆశ జారిపోయింది. రేపు మాపో ఊళ్లే సేటు రావడం ఖాయం. పరువు తీయడం ఖాయం. ఇంతకన్నా సావే నయం. పురుగు మందు తాగి సచ్చినా బాగుండు. అది కొనడానికీ జేబులో సరిపోయే పైసలు లేవు.' కాళ్లీడ్చుకుంటూ బస్టాండుకు వచ్చిండు.

ఇంకా బస్సు రాలేదు.

ఛాయ్ ఛాయ్...

సమోసా... బిస్కట్...

ఏ పల్లీ బఠాణీ...

బస్టాండంతా సందడిగా ఉంది.

"అయ్యా పాప్‌కార్న్ కావాలా...?"

ఎక్కన్నో విన్న గొంతు కావడంతో నారాయణ అటుతిరిగి చూశాడు.

లింగన్న. వాళ్లూరోడే. వ్యవసాయం దివాళా తీయడంతో ఊరొదిలి పెట్టి పట్నం చేరిండు.

"ఏమిరా లింగ...పల్లీ బఠాణీ అమ్ముతున్నావారా...?"

" అవునన్నా. ఆ యవసాయం చేసి అప్పుల పాలయే దానికన్నా ఇదే సుఖంగా ఉందే. రోజుకు ఎంత లేదన్నా రెండు మూడొందలు వస్తయి. లాభం రాకుంటేమాయె. పెట్టుబడన్న గ్యారంటీగ వస్తది. యవసాయం కన్న వందపాళ్లు నయం. సరేకనీ అగో... పట్నం బస్సు వచ్చింది నాలుగు గిరాకిలొస్తయి. పోయొస్త," అనుకుంట గబగబా పోయిండు.

లింగయ్యది పెద్ద వ్యవసాయం. పదెకరాలపైనే భూమి వుండేది. బోర్లు వేసి వేసి ఐదారు ఎకరాలు అమ్మిండు. ఇంక మిగిలిన భూమి కూడా అప్పుల కింద సరిపో యింది. ఇంకేముంది. పొట్ట సేతపట్టుకుని పట్నం వచ్చిండు.

'థూ దీని తల్లి. ఇంత బతుకు బతికి పల్లీ బఠాని అమ్ముతుండు. అదే నేనైతే సిగ్గుతోని సచ్చిపోయేటోన్ని. దానికన్న మర్రిచెట్టు కింద ఉరిబెట్టుకుంటే నయం...' అనుకున్నడు నారాయణ. ఇంతలో బస్సు రావడంతో ఎక్కి కూర్చున్నడు.

మళ్లీ చిన్న కునుకుపట్టింది.

జడల మర్రిచెట్టు. తాళ్లు... ఉరితాళ్లు... గబ్బిలాలు... తాత... నాన్న.

రా... రా... రా... రమ్మని ఊడలు చాచి పిలుస్తోంది మర్రిచెట్టు.

ఉలిక్కిపడ్డాడు నారాయణ.

'దీని తల్లి కన్ను తెరిస్తే ఆ మర్రిచెట్టే... మూస్తే మర్రిచెట్టే. నాకు ఏదన్న దయ్యంగిట్ట పట్టిందా...? చెట్లమీద ఆత్మలేమన్నా రమ్మని పిలుస్తున్నయా...?'

జగ్గడు కూడా నాలుగైదు రోజులు పిచ్చోని లెక్క అరిచి అరిచి... ఆఖరికి ఆ చెట్టుకే ఉరి పెట్టుకుండు.

నారాయణకు కూడా అప్పు గురించి ఆలోచించి... ఆలోచించీ పిచ్చి పట్టి నట్లైంది.

బస్సు ఊరికి చేరింది. ఊరిలో దిగిండో లేడో.ఊరంతా ఒకటే కలకలం.

నర్సిగాడు... ఉరి పెట్టుకున్నడట. పొద్దున పట్నం పోయెటపుడు కూడా నారాయణతో మాట్లాడిండు. గబగబ నారాయణ నర్సిగాని ఇంటికి పోయిండు. ఇంటి నిండా జనం. నిండా ఇరవై ఏళ్లు కూడా లేని నర్సిగాని పెళ్లం శవం మీద పడి గుండెలు బాదుకుంటోంది.

సూడ సక్కని పువ్వుల్లాగా ఉన్న ఇద్దరు బిడ్డలు. ఇంత చిన్నపిల్లల్ని వదిలి ఎవరికైనా చనిపోవాలనిపిస్తదా.

ప్రాణామంతా ఎట్లనో దిగాలుగా అనిపించింది నారాయణకు. ఆలోచించు కుంటూనే ఇంటికి వొచ్చిండు నారాయణ.

"బంగారమసోంటి బిడ్డ. నర్సిగాడు. పొద్దున నీ కోసం ఇంటిక్కూడా వచ్చినడు. వానలేక పంట మొత్తం తెర్లయిపోయిందని ఒకటే బాదపడ్డడు," పూలమ్మ భర్త దగ్గర కన్నీళ్లు పెట్టుకుంది.

నారాయణకు తినాలని కూడా అనిపించలేదు. కాళ్ల మంచం వేసుకుని కూలబడ్డడు.

'ఏందిది...? ఎందుకు ఒకని తర్వాత ఒకడు పిట్టలు రాలినట్లు రాలుతున్నరు. దేనికి భయపడి... అప్పు తీరదన్న భయమా... అట్టయితే నర్సిగాడు ఎన్నడో సావాలే. నర్సిగాడు చానా ధైర్యస్తుడు. కొమ్ములు దిరిగిన కోడెను కూడా వంచేటోడు. అసలు భయమన్నదే తెలీదు. అర్ధరాత్రి, అపరాత్రి ఎక్కడికైనా వెళ్లేవాడు. ఎంత లోతు బాయిలో అయినా ఏదన్నా పడిపోతే మునిగి తెచ్చేటోడు. ఆరడుగుల తాచుపామును ఒడుపుగా మెడపట్టుకుని ఆడించేంత ధైర్యమున్న నర్సిగాడు దేనికి భయపడ్డడు? అప్పుకైతే కాదు.'

"మన ఇంటి కాడ గొడవచేసినట్లే నర్సిగాని ఇంటికాడ కూడా సేటు లొల్లి పెట్టిండట. తల్లినీ, పెళ్లాన్నీ అనరాని మాటలన్నడట..." పూలమ్మ చెప్తోంది.

నారాయణకు ఇప్పుడర్థమైంది. 'దేనికి భయపడని నర్సిగాడు పరువుకు భయపడ్డడు. ఇంత కాలం పరువుగా బతికిండు. ఇప్పుడు పదిమంది ముందు ఇజ్జత్ పోయిందని భయపడ్డడు.'

ఒక్క నర్సిగాడే కాదు. మొత్తం రైతులందరిదీ అదే పరిస్థితి. ఏ నా కొడుకు రూపాయ సాయం చేయకున్నా ఫరవాలె. ఎన్నడు ఎవని కాడికి పోయి ఉత్త పుణ్యానికి రూపాయ ఇయ్యుమని అడగలే. అప్పులు, వడ్డీలు మాఫీ చేయమని కూడా అడగలే. రవ్వంత... ఒక్క రవ్వంత ధైర్యం... కాసింత భరోసా... ఈ రెండు ఉంటే చాలు... ఆఖరి రక్తంబొట్టు వరకూ ఎద్దులాగా కష్టపడతాం. చర్మం చెప్పులు కుట్టించి ఇయ్యుమన్నా ఇస్తాం.

భూమాతకు సెప్పలేనంత ఓపిక, సహనం. రైతు తన బిడ్డ గాబట్టి ఆ తల్లి రైతుకు ఓపికను, సహనాన్ని ఇచ్చింది. ధైర్యం మాత్రం ఎవ్వడూ ఇయ్యటంలేదు.

'అవునూ...తనూ ఇంత కాలం భయపడేది ఆ పరువు పోతుందనేనా...? అప్పు ఇవాళ కాకుంటే రేపన్నా తీరుతుంది. పరువు పోతే...?'

"ఇంతకీ పట్నంల సేటు ఏమన్నాడయ్యా...?" పూలమ్మ పిలుపుతో లేచి కూచున్నాడు నారాయణ. ఏమీ మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్లి మంచంల పడుకున్నాడు.

పట్నంల ఏం జరిగిందో చెప్పకుండానే అర్థమైపోయింది పూలమ్మకు. ఉన్న ఆశ కూడా జారిపోవడంతో కళ్లనిండా నీళ్లు తిరిగాయి. కానీ ఏడిస్తే భర్త గుండె పగులు తుందని కన్నీళ్లని కంటి రెప్పల చాటునే దాచేసింది.

అప్పు వసూలు కోసం సేటు ఇంటికి వస్తే... ఏం జరుగబోతుందో తలుచు కుంటేనే భయంగా ఉంది నారాయణకు.

"పుల్లిగాని కొడుకు నారిగాని ఇల్లు వేలంపాట. ఒకటోసారి. రెండోసారి. మూడోసారి..."

పోయింది. ఇంత కాలం కాపాడుకున్న పరువు గంగల కలిసిపోయింది. ఇజ్జతి పోయినంక బతకటం దండగ.

పోలీసు వేధింపులు తట్టుకోలేక ఆ చెట్టు కిందే ఉరేసుకున్నాడు తాత.

అప్పు తీర్చలేక ఆ చెట్టు కొమ్మకే వేలాడిండు నాయన.

పిల్లలు పుట్ట లేదని, గొడ్రాలని అత్త సాధిస్తుంటే... ఆ పోరు తట్టుకోలేక ఉసురు తీసుకుంది ఊర్మిళక్క.

నిన్న జగ్గడు. ఇవాళ నర్సిగాడు. వాళ్ల లాగే నేనూ చెట్టుకు వేలాడాల్సిందేనా...? తప్పదా...?

ఆ ఊహకే ఒళ్లంతా జలదరించింది. వెన్నుపూసలో కరెంట్ షాక్ కొట్టినట్లైంది. గబగబ లేచాడు. ఇంటి పైకప్పు సూరులో దాచుకున్న సారాయి సీసా బయటకు తీశాడు. మొత్తం ఒక్క గుటకలో ఖాళీ చేశాడు. దేనికోసమో ఆ చీకట్లోనే చప్పుడు కాకుండా మెల్లగా వెతికాడు. కాసేపటికి దొరికింది. తలుపు తీసుకుని బయట కొచ్చాడు. వేగంగా మర్రిచెట్టు వైపు నడిచాడు.

అదే చెట్టు. జడలు విరబోసుకున్న చెట్టు. ఊడలు చాచి పిలుస్తోంది.

రా... రా... తాళ్లు... ఉరితాళ్లు...

వేలాడుతున్న గబ్బిలాలు. క్రీన్ క్రీన్ క్రీన్.

వేగంగా చెట్టుదగ్గరికి చేరుకున్నాడు.

ఎవరన్నా వస్తున్నారేమోనని అటూ ఇటూ చూశాడు.

గబగబా తన పని మొదలుపెట్టాడు.

✤

భర్త మంచంలో లేకపోవడంతో పూలమ్మ ఉలిక్కిపడింది. రెండు మూడు రోజుల నుంచి మొగడు ఏదో తేడాగా కనిపిస్తున్నాడు. ఈ మనిషి ఏ ఘోరం చేస్తాడోనన్న భయంతో ఓ కంట కనిపెడుతూనే ఉన్నా... ఎప్పుడో ఒళ్లు తెలియని నిద్రపట్టింది.

ఎంతసేపటికీ నారాయణ ఇంటికి రాకపోయేసరికి పూలమ్మ మనసులో ఏదో కీడు శంకించింది. దిగ్గున మంచం దిగి ఊరవతల ఊడల మర్రిచెట్టు వైపు వేగంగా పరిగెత్తింది. గబగబా చెట్టు దగ్గరకు చేరుకుంది. దూరంగా ఏదో ఆకారం కదులుతోంది. దగ్గరగా వచ్చి... అక్కడి దృశ్యం చూసి ఉలిక్కిపడి ఆగిపోయింది.

✤

మర్రిచెట్టు... ఊరవతల ఊడల మర్రిచెట్టు...

పక్కన గొడ్డలితో నారాయణ.

కోపం, కసి, బాధ... అన్నీ కలిసిపోయి ఆవేశంగా మర్రిచెట్టు మొదలు మీద దెబ్బ మీద దెబ్బ వేస్తున్నాడు. బ్రహ్మరాక్షసిని వధిస్తున్న పరశురామునిలా... ఉగ్ర నరసింహునిలా ఊగిపోతున్నాడు.

నిన్నటిదాకా జడలు విరబోసుకుని భయపెట్టిన మర్రిచెట్టు... నిలువెల్లా వణికిపోతుంది.

ఇప్పుడు నారాయణకు భయంలేదు. మర్రిచెట్టన్నా... అప్పు అన్నా.... అప్పిచ్చిన సేటు అన్నా...

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*4 అక్టోబర్ 2016*

✻



8 ఏప్రిల్ 1982న పుట్టిన చందు తులసి అసలు పేరు పి. చంద్రశేఖర్. స్వగ్రామం నల్గొండ జిల్లా సూర్యాపేట దగ్గరున్న బండమీది చందుపట్ల. ఊరవతల ఊడలమర్రి వీరి మొదటి కథ. ఇప్పటివరకు నాలుగు కథలు రాశారు. వృత్తి ఉపాధ్యాయుడు.

*చిరునామా: బండమీది చందుపట్ల గ్రామం, చివ్వేంల మండలం, నల్గొండ జిల్లా - 508 213. ఫోన్: 99855 83022*
**chandhuthulasi9@gmail.com**